

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

### ఆనాటి వానచినుకులు

**దుబాయ్‌లో** విమానం మారి, న్యూయార్క్ వెళ్ళే విమానం ఎక్కి స్థిమితపడ్డాక చిరాగ్గా చెప్పాడు రామచంద్రరావు.

"ఒక ప్రహసనం ముగిసింది. ఇంకా పదిహేనుగంటల ప్రయాణం. దిగాక ఆ ఇమ్మిగ్రేషన్ క్యూలో ఓ గంట నించోవాలి. తర్వాత సామాను తీసుకోవాలి. నావల్ల కాదురా అంటే పెద్దాడు వినడు. రావల్సిందే అంటాడు.."

"పాపం వాడి ముచ్చట వాడిది. కొడుకు ఫస్ట్ బర్త్‌డే అని రమ్మన్నాడు. ఒకరోజు కష్టం అంతేగా?" హేమ నచ్చచెప్పింది.

"ఫస్ట్ బర్త్‌డే! ఆ మాటంటేనే నాకు చిర్రెత్తుకొస్తుంది, అదేదో అద్భుతం అన్నట్టు సెలబ్రేషన్స్. ఇండియానించి చుట్టాలు. పిల్లాడు పుట్టిన ఏడాదికి బర్త్‌డే రాక ఏం చేస్తుంది? అదేదో వీడి కొడుక్కే వచ్చినట్టు" అరిచాడు రావు.

"ష్! ఇది మనిల్లుకాదు. మెల్లగా" హేమ మందలించింది.

"హుఁ" రావు మూలిగాడు.

ఆయన చేతిని తన చేతిలోకి తీసుకుంటూ మృదువుగా అడిగింది హేమ.

"మార్గాయాసం తెలీకుండా ఓ కథ చెప్పనా?"

ఆయన చెయ్యి లాక్కోబోయి, చుట్టూ చూసి తమని ఎవరూ గమనించడం లేదని గ్రహించి ఊరుకున్నాడు. తర్వాత అడిగాడు.

"ఏం కథ? భేతాళకథా?"

"కాదు. ప్రేమకథ. నా ప్రేమకథ."

"నీ ప్రేమకథా?" రావు నివ్వెరపోయాడు.

"అవును. హేమాంగిని ప్రేమకథ. చెప్పనా?"

"హు." రావు మళ్ళీ మూలిగాడు.

"మాదో చిన్న టౌను. మీకు తెలుసుగా? మా ఊళ్ళోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నేను టెన్త్ వరకు చదివాను. మా స్కూల్ దగ్గర్లో ఒక చర్చ్ ఉండేది. మేము మధ్యాహ్నం క్లాసులు లేనప్పుడు చర్చ్ ఆవరణలో ఆడుకునేవాళ్ళం. ఓ రోజు మాకక్కడ ఒక కొత్తబ్బాయి

కనిపించాడు, తెల్లని శరీరఛాయ, నీలికళ్ళు, జుట్టు మా అంత నల్లగా ఉండేదికాదు. మాతో ఆడుతూ తను ఆ చర్చ్‌కి కొత్తగా వచ్చిన ఫాదర్ కొడుకునని చెప్పాడు. ఫాదర్, వాళ్ళావిడ మామూలుగానే ఉన్నారు. మరి ఇతనికి ఈ పోలికలు ఎందుకు వచ్చాయో! ఇంటికి వెళ్ళబోయే ముందు ఆ అబ్బాయి రహస్యంగా ఓ చాక్లెట్ నా చేతిలో పెట్టాడు.''

''దాహంగా ఉంది. కొంచెం మంచినీళ్ళు ఇవ్వమని చెప్తావు?'' రావు చేతిని లాక్కుంటూ చెప్పాడు.

హేమ లేచి వెళ్ళి ఓ చిన్న వాటర్ బాటిల్‌తో వచ్చి దాన్ని ఆయనకిచ్చింది.

''అప్పుడు నేను నైన్త్‌క్లాస్, ఆ తర్వాత నాలుగురోజులకి ఆ అబ్బాయ్ మా క్లాస్‌లో చేరాడు. పేరు విక్టర్. మా సోషల్ మాస్టారు అడిగారు. 'ఒరేయ్! మీ పూర్వీకులు ఎవరన్నా బ్రిటిష్ వాళ్ళని చేసుకున్నారేమిట్రా? నీకు యూరోపియన్ పోలికలు వచ్చాయి?'' అంతా నవ్వాం. విక్టర్ కూడా నవ్వి 'తెలీదు మాస్టారూ' అన్నాడు.

విక్టర్ తన కవళికలతోపాటు తెలివితేటలతో కూడా మా క్లాస్‌లో అట్రాక్షన్ అయ్యాడు. సంవత్సరం మధ్యలో చేరినా తర్వాత జరిగిన యూనిట్ టెస్ట్‌ల్లో అన్ని సబ్జెక్ట్స్‌లో ఫస్ట్ వచ్చాడు.

''నేను ఎబౌ ఏవరేజ్ స్టూడెంట్‌ని. క్లాస్‌లో ఉన్నానో లేదో గుర్తించలేనంత నెమ్మదిగా ఉండేదాన్ని. ఓ రోజు నేను గేమ్స్ పిరియడ్‌లో మా స్కూల్ ఆవరణలో ఉన్న చింతచెట్టు కింద కూర్చుని మర్నాడు చూపించాల్సిన హోం వర్క్ చేసుకుంటున్నాను. విక్టర్ వచ్చి నా పక్కన కూర్చున్నాడు. పలకరింపుగా నవ్వాను. నిక్కర్ జేబులోంచి చాక్లెట్ తీసిచ్చాడు.

''నీకేదైనా సబ్జెక్ట్ కష్టంగా ఉంటే చెప్పు హేమాంగినీ. నేను అర్థమయ్యేట్లు చెప్తా'' అన్నాడు.

స్కూల్ రిజిస్టర్‌లో నా పేరు హేమాంగిని అని ఉన్నా అంతా నన్ను హేమ అనే పిలుస్తారు. విక్టర్ నా పూర్తి పేరుతో పిలిస్తే కొత్తగా అనిపించింది. అప్పటినించి ప్రతీరోజు సాయంత్రం అదే చింతచెట్టు కింద నాకు హోం వర్కులో సహాయపడేవాడు. నలభై ఏళ్ళనాటి సంగతి. ఆ రోజుల్లో ఎవరూ మమ్మల్ని ప్రత్యేకంగా చూడలేదు. క్రమేపీ పుస్తకాలు ముందుపెట్టుకుని కబుర్లు చెప్పుకునేవాళ్ళం. ఏవేవో మాటలు. చాలా త్వరగా నేను విక్టర్ గాఢస్నేహితులయ్యాం''

''చలిగా ఉంది. కొద్దిగా ఏసి తగ్గిస్తావు?'' రావు బ్లాంకెట్ కప్పుకుంటూ అడిగాడు. హేమ ఆ పనిచేసి చిరుకోపంగా అడిగింది.

''మీకు నా ప్రేమకథ వినాలని లేదా? బోర్ కొడుతోందా?''

''లేదులే. చెప్పు'' ఆయన అర్ధాంగీకారంగా నిశ్శబ్దం వహించాడు.

''నైన్త్ పరీక్షలైన వెంటనే టెన్త్‌క్లాస్ పాఠాలు మొదలు పెట్టారు. ఆ రోజుల్లో గవర్నమెంట్ స్కూల్స్‌లో కూడా చదువు బాగా చెప్పేవాళ్ళు. నేను ఓణీలు, విక్టర్ పేంట్లు వేయడం మొదలుపెట్టాక మా మధ్య స్నేహానికి మించినది ఏదో ఉందని మా ఇద్దరికీ అర్థమైంది. సెలవులకి ముందు విక్టర్ వాళ్ళ నాన్న వెళ్ళే ప్రార్థనా కూటములకి చెందిన పాంప్లెట్ నాకు ఇచ్చేవాడు. ఆయన ఊళ్ళో ఉండని రోజుల్లో నేను మా అమ్మకి ఏదో వంక చెప్పి మధ్యాహ్నాలు చర్చ్‌కి వెళ్ళేదాన్ని. ఎవరూ ఉండేవాళ్ళుకాదు. నిశ్శబ్దంగా ఉండేది. మేము ఆల్టర్‌కి ఎదురుగా ఉండే చెక్క బెంచీల మీద కూర్చుని కబుర్లు చెప్పుకునేవాళ్ళం. విక్టర్ వాళ్ళమ్మ చర్చ్ ఆవరణలోనే ఉన్న వాళ్ళ చిన్న ఇంట్లోంచి బయటకి వచ్చేదికాదు.

ఓ రోజు విక్టర్ నా చేతిని పట్టుకుని చెప్పాడు.

''హేమాంగినీ. నీ ఒళ్ళేకాదు. నీ మనసు కూడా బంగారమే''

నా జీవితంలో పరాయి మగవాడి స్పర్శ అదే ఆటల్లో క్లాస్‌మేట్స్‌ని తాకినా కావాలని నన్ను ఒక మగాడు తాకడం అదే ప్రథమం.''

''టేకాఫ్ అయి అరగంటైంది. వెల్కం డ్రింక్ ఇవ్వడం మానేసినట్లున్నారు ఎకానమీ క్లాస్‌కి'' రావు మూలిగాడు.

హేమ మౌనం వహించింది. అరనిమిషం తర్వాత రావు అడిగాడు.

"చెప్పు, ఆపేసావే?"

"మీకు వినాలని లేదుగా"

"ఉంది. చెప్పు."

"మరి డిస్టర్బ్ చేయరుగా?"

రావు మాట్లాడలేదు.

"టెన్త్ పరీక్షల్లో ఇద్దరికీ మంచి మార్కులు వచ్చాయి. ఇంటర్‌లో చేరాం. సి.ఇ.సి గ్రూప్ తీసుకున్నాం. మా స్నేహం ఎప్పుడు ప్రేమగా మారిందో తెలీదుకాని మేమిద్దరం గాఢంగా ప్రేమించుకున్నాం. చర్చ్‌లో కలుసుకున్నప్పుడు భవిష్యత్తు గురించి కలలు కనేవాళ్ళం. చాలా నేలబారు కలలు. ఇద్దరం బి.కామ్‌లో చేరాలి. బేంక్ ఉద్యోగాలు తెచ్చుకోవాలి. పెద్దల్ని ఎదిరించైనా పెళ్ళి చేసుకోవాలి. ఇద్దరు పిల్లల్ని కనాలి... విక్టర్ నన్ను అపురూపంగా చూసేవాడు. నేనేం చెప్పినా ఆసక్తిగా వినేవాడు... నా చేతిని మృదువుగా పట్టుకుని మాట్లాడేవాడు. అంతకు మించి చనువు తీసుకునేవాడు కాదు" హేమ కంఠంలో స్వల్పంగా వణుకు.

ఏర్‌హోస్టెస్ బ్రేక్‌ఫాస్ట్ సర్వ్ చేసి వెళ్ళింది. ఇద్దరూ మౌనంగా తిన్నారు. రావు లేచి బాత్‌రూంకి వెళ్ళొచ్చాడు. రాగానే హేమ అతనికి షుగర్ టాబ్లెట్ ఇచ్చింది. దాన్ని మింగుతూ అడిగాడు.

"అంత ప్రేమించిన దానివి వాడినెందుకు చేసుకోలా?"

హేమ మొహంలో విషాదం.

"నాది ఆనందకరమైన బాల్యం. చిన్న కుటుంబం. అమ్మా, నాన్నా, నేను, తమ్ముడు. మీకు తెలుసుగా నాన్న సహకార బేంక్‌లో టెల్లర్‌గా పనిచేసేవాడు. ఆయనకి వచ్చే జీతంతో మేము తృప్తిగానే బతికేవాళ్ళం. నేను ఇంటర్ సెకండియర్‌లో ఉండగా నాన్నకి హార్ట్‌అటాక్ వచ్చింది. త్వరగానే కోలుకున్నాడు కాని ఆయనకి మానసికంగా అధైర్యం, దిగులు వచ్చాయి. తనకేదైనా ఐతే అమ్మ ఈ సంసారాన్ని, బాధ్యతలని ఎలా ఈదగలదు అనే అనుమానం వచ్చింది. ముఖ్యంగా నా పెళ్ళి ఎలా చేయగలదని. దాంతో 'నువ్వు చదివినంత చదివిస్తాను' అనే నాన్న ఎండాకాలం సెలవుల్లో నా పెళ్ళి చేయాలని సంబంధాలు వెదకడం మొదలుపెట్టాడు. నేనూ అమ్మా ఎంత మొత్తుకున్నా ఆయన మా మాట వినలేదు. 'నాకేదైనా అయితే మీరెలా బతుకుతారు?' అనేవాడు. నేను విక్టర్‌తో ఈ విషయం చెపితే విలవిల్లాడిపోయాడు.

'ఎలా హేమాంగిని? ఏం చేయాలి?' అని కన్నీరు పెట్టుకున్నాడు. ఇంటర్మీడియట్ వాళ్ళం పెద్దలని ఎదిరించి పెళ్ళి చేసుకుని స్వంతంగా బతకగలగడం, కూలీనాలీ చేసుకుని ఆనందంగా ఉండటం సినిమాల్లోనే కానీ నిజజీవితంలో జరిగేపని కాదని మా ఇద్దరికీ తెలుసు. మా నాన్నకి వచ్చిన ఆ మైల్డ్ హార్ట్ అటాక్ రెండు నిస్సహాయ హృదయాలని వేరు చేసింది. ఓ మధ్యవర్తి ద్వారా ఓ సంబంధం వచ్చింది. అబ్బాయి బుద్ధిమంతుడు, కష్టపడి పైకి వచ్చాడు. గవర్నమెంట్ ఉద్యోగం. కాకపోతే అబ్బాయికున్న బాధ్యతలు నిర్వర్తించడం వల్ల పెళ్ళి ఆలస్యమైంది. ఇంత కాలానికి పెళ్ళికి సుముఖత చూపాడు, అతని వయసు ఇరవై ఎనిమిది! నాకు పదిహేడు. పదకొండేళ్ళ తేడా! అమ్మ హోరాహోరీ పోట్లాడినా నాన్న వినలేదు. విజయవాడ వాస్తవ్యుడు రామచంద్రరావుతో నా పెళ్ళయిపోయింది." హేమ ఓ క్షణం ఆగింది.

"ఈ విషయం నాకు అప్పుడెందుకు చెప్పలేదు?" రావు కోపంగా అడిగాడు.

"ఏం చేసేవారు?" హేమ నవ్వింది.

"పెళ్ళయి మీ ఇంటికి వచ్చాక అదో వింత ప్రపంచం. చెప్పాగా నాది అందమైన బాల్యం. మీది అందుకు విరుద్ధం. మీ నాన్నకి బహు సంతానం. బాధ్యతగా ఫీలవరు. దాంతో మీరు, మీ అమ్మ ఆ సంసారాన్ని ఓ ఒడ్డుకి చేర్చారు. మీరు ఇరవైరెండేళ్ళకి గవర్నమెంట్

ఉద్యోగం సంపాదించారు. పొదుపుగా ఉంటూ ఒక అక్క, ఇద్దరు చెల్లెళ్ళు, ఓ తమ్ముడికి పెళ్ళిళ్ళు, ఉద్యోగాలు పురుళ్ళులాంటివన్నీ చూసారు. మీ ఇంట్లో అంతా రాజకీయం ఒకరిమీద మరొకరు అసూయపడేవాళ్ళు. మీ అమ్మకి ఫిర్యాదులు చెప్పేవాళ్ళు. ఆవిడ వాటిని ఆనందించేది, ప్రోత్సహించేది. మీరు చాలా గంభీరంగా, పలుకే బంగారమా అన్నట్లు ఉండేవారు. మీ పెద్దరికం నిలబెట్టుకోడానికి అహర్నిశలు పాటుపడేవాళ్ళు. ఈ ప్రపంచంలోకి వచ్చిన నేను తిరణాలలో తప్పిపోయిన పిల్లలా బిక్కమొహం వేసాను. అమ్మా నాన్నలకి నేను బంగారు తల్లిని. విక్టర్‌కి యువరాణిని. అలాంటి నేను హఠాత్తుగా నాకు ఏ మాత్రం విలువ, ప్రాధాన్యత ఇవ్వని కుటుంబంలోకి వచ్చిపడ్డాను. పంజరంలో చిలకలా అలమటించిపోయాను. బెడ్‌రూంలో కూడా భయంగానే సహకరించేదాన్ని. మీకు ఏ మాత్రం సున్నితత్వం, భావుకత్వం లేవు. యవ్వనంలో ఏవైనా కలలు కలలు కన్నారేమో కాని, ఇరవై ఎనిమిదేళ్ళకి వైవాహిక జీవితం అంటే ఉద్యోగంలా యాంత్రికమైపోయింది. ఓయ్! ఏయ్! అని తప్ప హేమ అనికూడా పిలిచేవాళ్ళుకాదు. ఐనా నేను శ్రమిద్దాం అనుకున్నా. మిమ్మల్ని మెల్లిగా మార్చచ్చు అనుకున్నా. పెళ్ళయిన కొత్తల్లో, మీ అమ్మ, మీ అక్కవాళ్ళింటికి వెళ్ళినప్పుడు మనిద్దరమే ఉన్నాం. మీరు ఆఫీస్‌నించి రాగానే, మంచినీళ్ళగ్లాస్ అందించి, మీ నుదుటిమీద మృదువుగా ముద్దుపెట్టుకున్నాను. మరుక్షణం గ్లాస్ విష్ణుచక్రంలా తిరుగుతూ వెళ్ళి గుమ్మంలో పడింది. నేను బిత్తరపోయా.

"ఈ.. వేషాలు నా దగ్గరకాదు. సంసారిలాగా ఉండు" గర్జించారు. భరించలేనంత దుఃఖం వచ్చింది. 'విక్టర్ అయితే ఒక్కనాటికీ ఇలా చేయడు' అనుకున్నాను. ఆ తర్వాత చాలాసార్లు విక్టర్‌ని తలచుకున్నాను." ఆమె కళ్ళల్లో నీళ్ళు.

రావు ఎర్రగా కందగడ్డ మొహంతో ఆమె వంక కోపంగా చూసాడు.

"పదిహేడేళ్ళ అమ్మాయి భర్తతో సరదా కబుర్లు చెప్పాలి అనుకుంటుంది - భర్తతో. బాస్‌తో కాదు. మీతో సహజీవనం నాకెప్పుడూ నచ్చలేదు. ఇన్నేళ్ళు అయిష్టంగానే ఉన్నాను." కన్నీళ్ళతో హేమ కళ్ళు తళతళ మెరిసాయి.

రావుకి ఏం మాట్లాడాలో అర్థంకాలేదు. అవమానంగా చుసాడు.

"ఓసారి మాటల్లో చెప్పాను 'లవ్ స్టోరీ సినిమాలో కుమార్ గౌరవ్ ఎంత బావున్నాడో! నాకు భలే నచ్చాడు' తక్షణం మీరు గట్టిగా అరిచారు. ఏమని అరిచారో గుర్తుందా?"

రావు మాట్లాడలేదు.

"వెళ్ళు. వెళ్ళి వాడితోనే పడుకో" అన్నారు. ఆ సినిమా చూసినప్పుడు ఇదే మాటలు విక్టర్‌తో చెప్పినప్పుడు ఏమన్నాడో తెలుసా? 'నిన్ను ఎప్పటికైనా బొంబాయ్ తీసుకెళ్ళి కుమార్ గౌరవ్‌ని చూపిస్తా హేమాంగినీ అన్నాడు.' సినిమా హీరో నచ్చాడంటేనే భరించలేని మీరు నేను ఒకబ్బాయిని ప్రేమించాను అంటే భరించగలరా? అందుకే ఇంతకాలం విక్టర్ గురించి మీకు చెప్పలేదు."

"మరి ఇప్పుడెందుకు చెప్తున్నావ్?" రావు విసురుగా అడిగాడు.

హేమ నవ్వింది.

"చెప్పాలనిపించింది. ఇందాక మనం సెక్యూరిటీ చెక్ క్యూలో నించున్నప్పుడు ఎవరో 'ఎయిర్ ఫ్రాన్స్ విక్టర్ హాక్' అని అరిచారు. చాలాకాలం తర్వాత విక్టర్ గుర్తొచ్చాడు. ఫ్లయిట్ ఎక్కాక టి.వి గైడ్ చూస్తే లవ్‌స్టోరీ సినిమా పేరు, కుమార్‌గౌరవ్ ఫోటో కనిపించాయి. నా పదిహేడేళ్ళ వయసులోకి వెళ్ళిపోయా" నవ్వింది.

రావు చురచుర చూసాడు.

"పదకొండేళ్ళ గేప్. ఈ కాలం పిల్లల భాషలో చెప్పాలంటే రెండు జనరేషన్ల గేప్. నాకు నచ్చింది మీకు ఫూలిష్. మీరు చెప్పేది నాకు చాదస్తం. పిల్లలకోసం తప్పనిసరి సంసారం. నాకు మీరంటే భయం. మీకు నేనంటే చులకన. ఇంటర్ రిజల్ట్స్ వచ్చాక అడిగాను. 'ప్రైవేట్‌గా డిగ్రీ చదువుతాను'

"నువ్వు ఉద్యోగాలు చేసి ఊళ్ళేలక్కర్లేదు." మీ తక్షణ సమాధానం.

"కనీసం డిగ్రీ అయినా చేద్దామని" నసిగాను.

"నువ్వు డిగ్రీ చదివితే ఎవరూ మెచ్చి మేకతోలు కప్పరు. నోర్మూసుకుని ఇంటిపనులు చూసుకో" అరిచారు.

తర్వాత తమ్ముడు ఉత్తరం రాసాడు, 'అక్కా మీ ఫ్రండ్ తెల్లబ్బాయి కలిసాడు. 'హేమాంగిని డిగ్రీ చదవచ్చుగా?' అని అడిగాడు. 'మా బావకి ఇష్టంలేదు' అని చెప్పా.

అదే నా ప్రియుడికి భర్తకి ఉన్న తేడా. ఆ తర్వాత నేను మా నాన్నని క్షమించలేకపోయాను. ఎప్పుడో పోతానని భయపడ్డ ఆయన మనబ్బాయి పెళ్ళిదాకా హాయిగా బతికాడు. పోయేవాళ్ళుపోక, ఉన్నవాళ్ళ జీవితాలని మార్చాలని ఎందుకు ప్రయత్నిస్తారో నాకు అర్ధంకాదు. నా పిల్లల్ని నా ఆలోచనా ధోరణితోనే పెంచాను. అందుకే వాళ్ళకి నేనంటే ప్రేమ. మీరంటే భయం. ఎంత భయమైనా మీరు నన్ను ఒక్క చిన్న మాట అన్నా వాళ్ళు ఊరుకోరు. వాళ్ళు మిమ్మల్ని చెడ్డగా అనుకోవడం మీకు ఇష్టంలేదు. అందుకే ఈ పదేళ్ళనించి నా జీవితం ప్రశాంతంగా సాగుతోంది"హేమ మళ్ళీ భర్త చేతిని అందుకుని నిమురుతూ చెప్పింది.

"మీకు అరవై ఐదు. నాకు ఏభై నాలుగు. మీకు షుగర్, బిపి ఇంకా చాలా జబ్బులున్నాయి. నేను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాను. నలభై ఐదంటే నమ్ముతారు. నేను లేనిదే మీరు బతకలేరు. వంట చేయడానికి, మందులివ్వడానికి, మంచినీళ్ళివ్వడానికి నేను కావాలి. మీరు ఇప్పుడు నా ప్రేమకథ చెప్పినా పెళ్ళయిన కొత్తల్లోలా అరవలేరు. గ్లాసులు గిన్నెలు విసిరికొట్టలేరు. 'నా ఇంట్లోంచి వెళ్ళిపో' అనలేరు. మనం ఆరునెలలు న్యూయార్క్‌లో ఉండబోతున్నాం. కొడుకు కోడలి ముందు మీ మంచితనం పోకూడదు. నేను లేకపోతే నిమిషం జరగదు. నేను విక్టర్‌ని ప్రేమించానని చెప్పినా, అతన్నింకా మర్చిపోలేదని చెప్పినా, మీమీద ప్రేమలేదని చెప్పినా మీరు ఏమీ చేయలేరు. అందుకే ఇన్నేళ్ళ తర్వాత నా ప్రేమకథ, హేమాంగిని విక్టర్ ప్రేమకథ చెప్పాను. మీరు మనిషిగా కూడా లెక్కచేయని హేమకి కూడా అపురూపంగా చూసుకునే ప్రియుడున్నాడని తెలియాలని చెప్పాను. ఇక పడుకోండి. పన్నెండు గంటల ప్రయాణం."

రావుకి ఆమె మాటల్లో కసి. విజయగర్వం కనిపించాయి.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments